ట్రంప్ అ'ద్వితీయం'

- అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ జయకేతనం
- నాలుగేండ్ల తర్వాత మళ్లీ అగ్రరాజ్యాధినేతగా ఎన్నిక
- రెండోసారి వైట్‌హౌజ్‌లోకి అడుగుపెట్టనున్న ట్రంప్
- 50 శాతానికి పైగా ఓట్లతో స్పష్టమైన ఆధిక్యం
- ఏడు స్వింగ్ స్టేట్స్‌లోనూ రిపబ్లికన్ పార్టీదే హవా
- ఉపాధ్యక్షుడిగా తెలుగింటి అల్లుడు జేడీ వాన్స్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ జయకేతనం ఎగరేశారు. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై భారీ విజయాన్ని సాధించి రెండోసారి అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. హోరాహోరీగా అనుకున్న పోరులో ఏకపక్ష విజయం సాధించి అందరి అంచనాలను తలకిందులు చేశారు. గెలుపోటములను నిర్ణయించే స్వింగ్ స్టేట్స్‌ను ట్రంప్ స్వీప్ చేశారు. డెమోక్రాట్లకు కంచుకోటల్లాంటి రాష్ట్రాల 'బ్లూ వాల్'ను బద్దలు కొట్టారు. కేసులను ఎదుర్కొని, కాల్పులను తట్టుకొని ఆయన పోరాడి గెలిచారు. దీంతో నాలుగేండ్ల క్రితం హింసాత్మక ఘటనల మధ్య వైట్ హౌజ్‌ను వీడిన ట్రంప్ ఇప్పుడు ప్రజా మద్దతుతో సగర్వంగా అడుగుపెట్టనున్నారు.

వాషింగ్టన్, నవంబర్ 6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించారు. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అంటూ ఆయన ఇచ్చిన నినాదానికి అమెరికన్లు ఓట్ల వర్షం కురిపించారు. దీంతో అగ్రరాజ్యానికి 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యారు. 538 ఎలక్టోరల్ ఓట్లలో విజయానికి కావాల్సిన 270 ఓట్లను ట్రంప్ సాధించారు. బుధవారం రాత్రి 11 గంటల సమయానికి ట్రంప్‌నకు 294 ఎలక్టోరల్ ఓట్లు దక్కగా, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ 223 ఓట్లు సాధించారు. మొత్తంగా ట్రంప్ 71,727,828(50.9 శాతం) ఓట్లు దక్కించుకోగా, కమలా హారిస్ 66,836,253(47.4 శాతం) ఓట్లు సాధించారు. ట్రంప్, కమల మధ్య హోరాహోరీ పోరు ఉంటుందని సర్వేలు అంచనా వేసినప్పటికీ ఫలితాల్లో మాత్రం ట్రంప్‌నకు స్పష్టమైన అనుకూలత కనిపించింది.

స్వింగ్ స్టేట్స్‌లో ఏకపక్షం..

అధ్యక్షుడు ఎవరనేది నిర్ణయించే ఏడు స్వింగ్ స్టేట్లలో ట్రంప్ హవా వీచింది. జార్జియా, నార్త్ కరోలినాలో విజయం సాధించిన ట్రంప్.. పెన్సిల్వేనియా, అరిజోనా, మిషిగన్, విస్కాన్సిన్, నెవాడాలోనూ స్పష్టమైన ఆధిక్యంలో కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లో ఏడు స్వింగ్ స్టేట్స్‌లో ఆరింట విజయం సాధించిన డెమోక్రాట్లు ఈసారి ఒక్కటీ సాధించలేకపోయారు. డెమోక్రాట్లకు పట్టున్న రాష్ట్రాల్లోనూ ఈసారి ట్రంప్ హవా కనిపించింది.

131 ఏండ్ల తర్వాత చరిత్ర..

అమెరికా చరిత్రలో వరుసగా రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైన వారు చాలామందే ఉన్నారు. అయితే, ఒకసారి గెలిచి, మరోసారి ఓడిపోయి, నాలుగేండ్ల తర్వాత తిరిగి గెలవడం మాత్రం అరుదు. దాదాపు 131 ఏండ్ల క్రితం 1893లో గ్రోవర్ క్లీవ్‌ల్యాండ్ ఈ ఘనతను సాధించగా, ఇప్పుడు ట్రంప్ అందుకున్నారు. ఇంతకుముందు 2017 జనవరి నుంచి 2021 జనవరి వరకు అమెరికా 45వ అధ్యక్షుడిగా ట్రంప్ పని చేశారు. 2020లో జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ చేతిలో ఆయన ఓడిపోయారు. 78 ఏండ్ల వయసులో అమెరికా అధ్యక్షుడిగా గెలిచిన ట్రంప్.. అమెరికా అధ్యక్షుడిగా గెలిచిన అతి పెద్ద వయస్కుడిగానూ రికార్డు సృష్టించారు.

ఇది అమెరికాకు స్వర్ణయుగం: ట్రంప్

తన గెలుపు అమెరికాకు స్వర్ణయుగం అవుతుందని, అమెరికాను మళ్లీ గొప్పగా మార్చేందుకు ఈ విజయం ఉపయోగపడుతుందని ట్రంప్ పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం అనంతరం బుధవారం ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో తన మద్దతుదారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 'నన్ను 47వ అధ్యక్షుడిగా ఎన్నుకున్న అమెరికా ప్రజలకు కృతజ్ఞతలు. ఇవాళ మనం చరిత్ర సృష్టించాం. ప్రతీ పౌరుడి కోసం నేను పోరాడతా. ఇది అమెరికాకు స్వర్ణయుగం అవుతుంది. మన సరిహద్దులను సరి చేస్తా. దేశ సమస్యలను పరిష్కరిస్తా. అమెరికాను మళ్లీ సురక్షితమైన, బలమైన, శక్తిమంతమైన, స్వేచ్ఛాయుతమైన దేశంగా మారుస్తా. నేను యుద్ధాలను ప్రారంభించను. యుద్ధాలను ఆపేస్తా.' అని ఆయన పేర్కొన్నారు. కాగా, ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా రావడంతో కమలా హారిస్ తన ప్రసంగాన్ని రద్దు చేసుకున్నారు.



అమెరికా ఉపాధ్యక్షుడిగా తెలుగింటి అల్లుడు

- జేడీ వాన్స్ సతీమణి ఉషా చిలుకూరి
- ఏపీ నుంచి వలస వెళ్లిన ఆమె తల్లిదండ్రులు

హైదరాబాద్, నవంబర్ 6: అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరపున ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ (40) ఎన్నికయ్యారు. రచయిత అయిన వాన్స్ 2023 నుంచి ఓహియో సెనేటర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తెలుగింటి అల్లుడు. వాన్స్ సతీమణి ఉషా చిలుకూరి(38) తెలుగమ్మాయి. దీంతో అమెరికా సెకండ్ లేడీ కానున్న మొదటి భారత సంతతికి చెందిన వ్యక్తిగా ఉష నిలవనున్నారు. ఉషా చిలుకూరి తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి. వీరి బాల్యం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని వడ్లూరుతో పాటు కృష్ణ జిల్లా పామర్రులో సాగింది. దాదాపు 50 ఏండ్ల క్రితం వీరు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఉష తండ్రి రాధాకృష్ణ(క్రిష్ చిలుకూరి) ఏరోస్పేస్ ఇంజినీర్. తల్లి లక్ష్మి శాన్‌డియాగో యూనివర్సిటీలో ప్రొఫెసర్. వీరికి 1986లో అమెరికాలోని శాన్‌డియాగోలో ఉష జన్మించారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి ఫిలాసఫీలో మాస్టర్స్ పూర్తి చేసిన తర్వాత ఆమె న్యాయవాద వృత్తిని చేపట్టారు. అక్కడి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జాన్ రాబర్ట్స్, బ్రెట్ కవనాగ్‌కు క్లర్క్‌గా, యేల్ జర్నల్ ఆఫ్ లా అండ్ టెక్నాలజీకి మేనేజింగ్ ఎడిటర్‌గా, యేల్ లా జర్నల్‌కు ఎగ్జిక్యూటివ్ డెవెలప్‌మెంట్ ఎడిటర్‌గా ఆమె పని చేశారు. యేల్ లా స్కూల్‌లో ఆమెకు జేడీ వాన్స్‌తో పరిచయం ఏర్పడింది. 2014లో వీరు వివాహం చేసుకున్నారు. వీరికి ఎవాన్(6), వివేక్(4), మీరాబెల్(2) సంతానం.

ఓడినా.. స్ఫూర్తి నింపిన కమల!

వాషింగ్టన్, నవంబర్ 6: దశాబ్దం క్రితం కమలా హారిస్‌ను ఒక జర్నలిస్టు 'లేడీ ఒబామా'గా అభివర్ణించాడు. ఈ ఎన్నికల్లో ఆమె అధ్యక్షురాలిగా విజయం సాధించి శ్వేత సౌధంలో అడుగుపెడతారని భావించిన నల్ల జాతి, భారతీయ వలస తల్లిదండ్రుల ఆశలు నెరవేరలేదు. అయితే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఆమె విజయం సాధించకపోయినా, రాజకీయాల్లో తమకు ద్వారాలు మూసుకుపోలేదన్న విశ్వాసాన్ని మహిళల్లో పాదుకొల్పారు. ముఖ్యంగా మహిళల్లో ఆమె స్ఫూర్తి, ఎనలేని ధైర్యాన్ని ఇచ్చారు. ఒక వేళ ఆమె ఈ ఎన్నికల్లో నెగ్గి ఉంటే తొలి మహిళ, తొలి ఆఫ్రికన్ అమెరికన్, తొలి భారతీయ సంతతి వ్యక్తిగా రికార్డు సృష్టించేవారు. అమెరికాకు తొలి ఉపాధ్యక్షురాలిగా సేవలందించిన 60 ఏండ్ల కమల తండ్రి నల్ల జాతీయుడు కాగా, తల్లి భారతీయురాలు. ఆమె తండ్రి డొనాల్డ్ హారిస్ జమైకాకు చెందిన వారు. చెన్నై నుంచి అమెరికాకు 1958లో వలస వచ్చిన ఆమె తల్లి శ్యామల గోపాలన్‌ను ఆయన వివాహం చేసుకున్నాడు. కమల 2017లో తొలిసారిగా యూఎస్ సెనేట్‌కు ఎన్నికయ్యారు. అమెరికా ఉపాధ్యక్షురాలిగా ఆమె పూర్వపు ఉపాధ్యక్షుల మాదిరిగా కాకుండా బైడెన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు.

రియల్ ఎస్టేట్ టైకూన్ నుంచి అగ్రరాజ్యాధినేతగా..

న్యూయార్క్, నవంబర్ 6: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జీవితంలో వారసత్వ వ్యాపారవేత్తగా మొదలై అగ్రరాజ్యానికి రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యే వరకు అనేక మలుపులు ఉన్నాయి. 2020 నుంచి 2024 వరకు ట్రంప్ అనేక న్యాయపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. న్యూయార్క్ కోర్టు ఓ కేసులో ఆయనను దోషిగా తేల్చింది. దోషిగా నిరూపితమైన ఏకైక అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్.

మృత్యుంజయుడిలా బయటపడి..

ఎన్నికల ప్రచారం ఆరంభంలోనే జూలైలో ట్రంప్‌పై మిల్వాకీలో కాల్పులు జరిగాయి. ఈ ఘటన నుంచి తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఆయన చెవి నుంచి బుల్లెట్ దూసుకెళ్లినా, రక్తం ధారలు కారుతున్నా ట్రంప్ భయపడకుండా పిడికిలి బిగించడం రిపబ్లికన్లలో కసి, అమెరికన్లలో ఆయన పట్ల సానుభూతిని పెంచింది. ఆ తర్వాత మరోసారి ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది. రెండుసార్లు ప్రాణాపాయం నుంచి తప్పించుకొని ఆయన మృత్యుంజయుడిగా నిలిచారు.

తండ్రి వారసత్వంగా వ్యాపారం..

1946 జూన్ 14న న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో మేరీ, ఫ్రెడ్ ట్రంప్ దంపతులకు ట్రంప్ జన్మించారు. తన తండ్రి స్థాపించిన వ్యాపార బాధ్యతలను 1971లో ట్రంప్ స్వీకరించి వృద్ధిలోకి తీసుకొచ్చారు. హోటళ్లు, రిసార్ట్‌లు, నివాస, వాణిజ్య భవనాలు, కాసినోలు, గోల్ఫ్ కోర్సులు ఇలా అనేక ప్రాజెక్టులను విజయవంతంగా చేపట్టారు. 2004లో 'ది అప్రెంటీస్' అనే రియాల్టీ షోలో పాల్గొని అమెరికాకు చేరువయ్యారు.

మూడు వివాహాలు..

ట్రంప్ మొదట అథ్లెట్, మాడల్ ఇవానా జెల్నికోవాను వివాహం చేసుకొని 1990లో విడాకులు ఇచ్చారు. 1993లో ఆయన నటి మార్లా మాపిల్స్‌ను పెండ్లి చేసుకొని 1999లో విడాకులిచ్చారు. 2005లో మెలానియాను వివాహం చేసుకున్నారు. ట్రంప్‌నకు మొత్తం ఐదుగురు సంతానం.

నా స్నేహితుడికి శుభాకాంక్షలు: మోదీ

ట్రంప్‌నకు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'చారిత్రక విజయాన్ని సాధించిన నా స్నేహితుడికి హృదయపూర్వక శుభాకాంక్షలు. భారత్ – అమెరికా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు వేచి చూస్తున్నా. మన ప్రజల అభ్యున్నతి కోసం, ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సుని ప్రోత్సహించేందుకు కలిసికట్టుగా పని చేద్దాం' అంటూ మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అనేక దేశాధినేతలు సైతం ట్రంప్‌నకు శుభాకాంక్షలు తెలిపారు.

పెండ్లికాని ప్రసాదులకు పెండ్లి చేస్తాం

ఎన్సీపీ శరద్ వర్గ అభ్యర్థి విచిత్రమైన హామీ

ముంబై, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్ర బీడ్ జిల్లాలోని పర్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో ధంజయ్ ముండేపై పోటీ చేస్తున్న నేషనలిస్ట్ కాంగ్రెస్ శరద్ చంద్ర పవార్ పార్టీ అభ్యర్థి రాజేసాహెబ్ దేశ్‌ముఖ్ అబ్బాయిలందరికీ పెళ్లి చేస్తానని విచిత్రమైన హామీ ఇచ్చారు. ఆయన తన ప్రచారంలో 'నేను ఎమ్మెల్యేగా గెలిస్తే.. అబ్బాయిలందరికీ పెళ్లిళ్లు చేస్తాను. అబ్బాయిలందరికీ ఉద్యోగం ఇప్పిస్తాను' అని హామీ ఇస్తున్నారు. గతంలో రాజేసాహెబ్ దేశ్ ముఖ్ కాంగ్రెస్ బీడ్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు.

పీఎంఎల్ఏ కేసుల్లో అధికారుల విచారణకు అనుమతి తప్పనిసరి

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: విధుల నిర్వహణలో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపిస్తూ పబ్లిక్ సర్వెంట్లను ప్రాసిక్యూట్ చేయాలంటే, ముందుగా అనుమతి పొందడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు బుధవారం చెప్పింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో ఐఏఎస్ అధికారులు బిధు ప్రసాద్ ఆచార్య, ఆదిత్య నాథ్ దాస్ మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపణలను ట్రయల్ కోర్టు విచారించింది. అయితే, ట్రయల్ కోర్టు ఆదేశాలను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. దీనిపై ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈడీ వాదనను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది.

పాముకాటుకు గోలీ!

5 గంటల వరకు పెరిగిన 'గోల్డెన్ అవర్'

న్యూఢిల్లీ: మనదేశంలో పాముకాటుకు గురై ఏటా వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకటి.. రెండు గంటల్లోగా (గోల్డెన్ అవర్) పేషెంట్‌కు యాంటీ వీనమ్ (స్నేక్ బైట్ సెరా) ఇంజెక్షన్ ఇవ్వకపోతే ప్రాణాలు దక్కటం అనుమానమే. చాలా మంది దవాఖానకు వెళ్లే మార్గంలోనే ప్రాణాలు విడిచిపెడతారు. దీనికి పరిష్కారంగా గోల్డెన్ అవర్‌ను పెంచే క్రమంలో సైంటిస్టులు గోలీని తీసుకొస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ట్రయల్స్‌లో మంచి ఫలితాలు వెలువడ్డాయి. మందు బిళ్ల తీసుకున్న కేసుల్లో గోల్డెన్ అవర్ 5 గంటల వరకు పెరిగిందని తాజా ప్రయోగాల్లో తేలింది. కోల్‌కతాలోని రెండు ప్రభుత్వ దవాఖానాల్లో ట్రయల్స్ చేపట్టగా సానుకూల ఫలితాలు వెలువడ్డాయి. దీంతో 'గోల్డెన్ అవర్' సమయం మరో గంట పెరుగుతున్నదని, ట్రయల్స్‌లో పాముకాటు బాధితులంతా ప్రాణాలతో బయటపడ్డారని వైద్యులు చెప్పారు.

దక్షిణాది దన్నుతోనే ఉత్తరాది అభివృద్ధి

తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై, నవంబర్ 6: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దక్షిణ, ఉత్తరాది రాష్ట్రాల అభివృద్ధిపై చర్చకు తెరలేపారు. ఉత్తరాది కన్నా దక్షిణ రాష్ట్రాలే అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయని ఆయన అన్నారు. తమిళనాడు నేతృత్వంలో దక్షిణాది రాష్ట్రాలు గణనీయమైన ఆర్థిక ప్రగతిని సాధించి దేశ ప్రగతిలో కీలకమైన పాత్ర పోషించడమే కాక, తద్వారా ఆ ప్రగతి ఫలాలు ఉత్తరాది రాష్ట్రాలకు అందజేస్తూ దన్నుగా ఉన్నట్టు ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో చేపట్టిన కొంగు బెల్టు యాత్రలో భాగంగా ఆయన మాట్లాడారు. డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురైను ప్రస్తావిస్తూ ఉత్తరాది వర్ధిల్లుతున్నప్పుడు.. దక్షిణాది క్షీణిస్తుందని ఆయన అనేవారని, అయితే ఇప్పుడు దక్షిణాది అభివృద్ధితో విలసిల్లుతున్నదని 20 26లో తాము తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

అమెరికా చదువుల సంగతేంటో?

- ట్రంప్ ఎన్నికతో భారతీయ విద్యార్థుల్లో ఆందోళన
- విద్యార్థి వీసాలను తగ్గిస్తారా?
- విదేశీ చదువులపై ప్రభావం చూపదంటున్న నిపుణులు
- హెచ్1బీ వీసాలు కష్టమే
- ఇమ్మిగ్రేషన్ నిబంధనలు కఠినతరమయ్యే ఛాన్స్

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): అగ్రరాజ్యం అమెరికాలో ప్రభుత్వం మారగానే మన దేశంలోని ఆశావహ విద్యార్థుల్లో దడ ప్రారంభమైంది. ఉన్నత చదువుల కోసం క్యూకట్టే అమెరికాలో ట్రంప్ కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ట్రంప్ వస్తే పూర్వంలా అమెరికా వెళ్లే అవకాశాలు తగ్గిపోతాయా? విదేశీ చదువులపై ఆయన రాక ఎంత మేరకు ప్రభావం చూపుతుందన్న ప్రశ్నలు మన విద్యార్థులను వేధించడం ప్రారంభించాయి. ట్రంప్ పాలనలో విద్యార్థి వీసాలకు ఢోకా ఉండకపోవచ్చు. కానీ ప్రత్యేకించి హెచ్1బీ వీసాలు కఠినతరం కానున్నాయి. ఇమ్మిగ్రేషన్ నిబంధనలు మారనున్నాయి. వర్క్ వీసాలు కష్టమయ్యే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే మాస్టర్స్ చదివి.. అమెరికాలో ఉద్యోగాలు చేయాలనుకుంటున్న వారిపై ఆశలపై నీళ్లు చల్లినట్లే. ట్రంప్ మొదటి నుంచి ఇతర దేశాల నుంచి వలసవచ్చే వారి కఠినమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిననాడే అక్రమ వలసలను అడ్డుకుంటామని ప్రకటించారు అయితే ఎడ్యుకేషన్ వీసాల పట్ల ట్రంప్ సానుకూలంగానే ఉంటారని.. ఇది కొంత అనుకూలమని నిపుణులంటున్నారు.

అందరి ఆశలూ అమెరికాపైనే..

లే ఆఫ్‌ల భయం.. ఆర్థిక మాంద్యం.. పైగా అనేక ఆంక్షలు, ఉద్యోగాల లేమి పీడిస్తున్నా మన విద్యార్థులు యూఎస్‌పైనే ఆశలు పెట్టుకుంటున్నారు. విదేశీ చదువుల కోసం అత్యధికులు అమెరికానే ఎంచుకుంటున్నారు. అమెరికా వీసాలు పొందుతున్న ప్రతి నలుగురు విదేశీ విద్యార్థుల్లో ఒక్కరు భారతీయ విద్యార్థి ఉండటం విశేషం. మన దేశంలోని 69శాతం విద్యార్థులు తమ అంతర్జాతీయ చదువులకు అమెరికానే అత్యుత్తమ గమ్యస్థానంగా భావిస్తున్నారు. 2023లో 1.40 లక్షల వీసాలను ఒక్క మన భారతీయ విద్యార్థులే పొందారు. అమెరికాలో ఉంటున్న వారిలో 18% భారతీయులేనని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. వీరిలో తెలంగాణ నుంచి 15 వేల మంది ఉంటారని అంచనా. దేశంలోని ముఖ్య నగరాలన్నింటితో పోల్చితే హైదరాబాద్ నుంచే అత్యధిక విద్యార్థులు అమెరికా చదువులపై ఉత్సుకత చూపుతున్నారు.

ప్రైషర్స్‌కు వేతనాలెక్కువ..

అమెరికాలో నైపుణ్యం గల యువతలో భారతీయులే అధికం. దీంతో పాటు ఫ్రెషర్స్‌కు మన దగ్గరితో పోల్చితే అమెరికాలో వేతనాలెక్కువ. డాలర్ ప్రభావం కూడా అధికం. దీంతో మనవాళ్లు అమెరికానే తమ మొదటి ఛాయిస్‌గా ఎంచుకుంటారు. అమెరికాలో 4500కు పైగా యూనివర్సిటీలు, 8 వేలకు పైగా కాలేజీలున్నాయి. చాలాకాలంగా అక్కడ మొత్తం సీట్లు నిండటం లేదు. మనవాళ్లు చేరితేనే వర్సిటీలు, కాలేజీల్లో సీట్లు నిండుతాయి. దీంతో స్టూడెంట్ వీసాలకు ఢోకా ఉండదని నిపుణులంటున్నారు.

చదువులకేం ఢోకా ఉండకపోవచ్చు

ట్రంప్ 2.0లో మూడు ప్రధానమైన అంశాలు ప్రభావితమయ్యే అవకాశముంది. విద్యార్థి వీసాలకు, చదువులకు ఢోకా ఉండకపోవచ్చు. అయితే అధిక నైపుణ్యం గల విద్యార్థులకు ప్రాధాన్యతనిస్తారు. అమెరికాలో వర్క్ ఫోర్స్‌కు డిమాండ్ మరింత పెరగనుంది. దీంతో హెచ్1 వీసాలు జారీ చేయాల్సి ఉంటుంది. కొత్త ప్రభుత్వం ఏం చేస్తుందన్నది భవిష్యత్తులో తేలనుంది. ఇమ్మిగ్రేషన్ దృక్కోణంలో ప్రస్తుతమున్న కోటా పద్ధతిని రద్దుచేసి, పాయింట్ బేస్డ్ సిస్టమ్‌ను తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

–హరికాంత్, సీఈవో ఎడ్యు టూ టెక్ కన్సల్టెన్సీ

ఇష్టారాజ్యంగా ఇండ్లు కూలుస్తరా?

మొదటిపేజీ తరువాయి...

ప్రక్రియ పాటించకుండా ఇంటిని కూల్చివేయడాన్ని తప్పుబడుతూ ఎలాంటి గడువు ఇవ్వకుండా రాత్రికి రాత్రే పౌరుల ఇళ్లను కూల్చివేయడం సబబు కాదని పేర్కొంది. దీనికైనా చట్టపరమైన విధానాన్ని అనుసరించాల్సిందేనని స్పష్టంచేసింది. బాధితుడికి యోగి ప్రభుత్వం రూ.25 లక్షలు పరిహారంగా చెల్లించాలని, ఈ కూల్చివేతకు ఎవరెవరు బాధ్యులో నిర్ధారించడానికి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ, ఆక్రమణల తొలగింపు సమయంలో రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలు అనుసరించాల్సిన మార్గదర్శకాలను సుప్రీం కోర్టు జారీ చేసింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం 2020కు సంబంధించిన ఒక సుమోటో కేసును బుధవారం విచారించింది. రహదారి ఆక్రమణ ఆరోపణపై 2019లో తన ఇంటిని యూపీ ప్రభుత్వం కూల్చివేసిందని మనోజ్ టిబ్రేవాల్ ఆకాశ్ అనే వ్యక్తి సుప్రీంకోర్టుకు లేఖ రాశారు. దీనిని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టిన ధర్మాసనం.. 'ఈ కేసులో ఇంటి కూల్చివేతలో ఎలాంటి చట్టపరమైన నిబంధనలు పాటించలేదు. రోడ్డు నిర్మాణంలో అక్రమాలు జరిగినట్టు తాను వార్తాకథనాన్ని ప్రచురించినందుకు ప్రభుత్వం ఈ కక్ష సాధింపునకు పాల్పడినట్టు పిటిషనర్ ఆరోపించారు. రాష్ట్రం అటువంటి చర్యకు పాల్పడటాన్ని సహించ లేము. ప్రైవేట్ ఆస్తితో వ్యవహరించేటప్పుడు చట్టాన్ని అనుసరించాలి' అని కోర్టు వ్యాఖ్యానించింది.

పౌరుల ఇళ్లలోకి ఎలా చొరబడతారు?

పిటిషనర్ ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని యూపీ ప్రభుత్వం చేసిన వాదనపై కోర్టు స్పందిస్తూ 'పిటిషనర్ 3.7 చదరపు మీటర్ల భూమిని ఆక్రమించాడని మీరు అంటున్నారు. ఈ విషయంలో మేమేమీ అతన్ని వెన కేసుకు రావడం లేదు. అతని ఆక్రమణ నిజమేనని అనుకుందాం. అయినా చట్టాలను అతిక్రమించి మీరు అతడి ఇంటిని ఎలా కూలగొట్టారు? ఎవరి ఇంటిలోకైనా ఇలా చొరబడటం అధర్మం కాదా?' అని యూపీ ప్రభుత్వం తరపున హాజరైన కౌన్సిల్‌ను సీజేఐ ప్రశ్నించారు. 'రాత్రికి రాత్రే ఇలా ఇళ్లు కూలగొట్టడానికి మీరు బుల్డోజర్లతో రాకూడదు. మీరు వారి కుటుంబానికి కనీసం ఎలాంటి సమయం కూడా ఇవ్వలేదు. అలాంటప్పుడు ఇంటిలో ఉన్న వస్తువుల సంగతేంటి? దేనికైనా చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలి కదా?' అని ధర్మాసనంలో సభ్యునిగా ఉన్న మరో న్యాయమూర్తి జస్టిస్ పార్దివాలా ప్రశ్నించారు. కేసు వివరాలు పరిశీలిస్తే యోగి ప్రభుత్వం బాధితుడికి ఎలాంటి నోటీస్ ఇవ్వలేదని అర్థమవుతున్నదని ధర్మాసనం పేర్కొంది. తాము ఇచ్చిన మార్గదర్శకాలను తప్పక పాటించాలని సీజేఐ అన్నారు.

చెవిటి దోమలతో డెంగ్యూకు చెక్!

న్యూఢిల్లీ : దోమల వల్ల వ్యాపించే వ్యాధుల నిరోధానికి శాస్త్రవేత్తలు వినూత్న విధానాన్ని కనుగొన్నారు. మగ దోమలకు చెముడు తెప్పిస్తే, డెంగ్యూ, యెల్లో ఫీవర్, జికాల వ్యాప్తిని నిరోధించవచ్చునని చెప్తున్నారు. ఆడ, మగ దోమలు ఎగిరేటపుడు తమ రెక్కలతో చప్పుడు చేస్తాయి. రెక్కల చప్పుడుకు మగ దోమలు ఆకర్షితులై, ఎగిరేటపుడే ఆడ దోమలతో జత కలుస్తాయి. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మగ దోమల వినికిడి శక్తిని పోగొట్టే విధంగా జెనెటిక్ పాత్‌వేను మార్చారు. మూడు రోజులపాటు ఈ మగ దోమలను ఆడ దోమలతో కలిపి ఒకే చోట ఉంచినప్పటికీ, అవి జత కలవలేదని గుర్తించారు. ఆడ దోమలు వ్యాధులను వ్యాప్తి చేస్తాయని, వీటికి పిల్లలు పుట్టకుండా చేయడం వల్ల వ్యాధుల వ్యాప్తిని నిరోధించవచ్చునని గుర్తించారు.

సిమ్ లేకుండానే కాల్స్, మెసేజ్‌లు

- 'డైరెక్ట్ టు డివైజ్'ను పరీక్షిస్తున్న బీఎస్ఎన్ఎల్

న్యూఢిల్లీ: దేశంలోని టెలికం రంగంలో బీఎస్ఎన్ఎల్ వినూత్న సేవను ప్రారంభించనుంది. 'డైరెక్ట్ టూ డివైజ్(డీ2డీ)' సాంకేతికతను పరీక్షిస్తున్న ఈ సంస్థ త్వరలోనే అందుబాటులోకి తీసుకురానుంది. దీని ద్వారా సిమ్ కార్డుల అవసరం లేకుండా, మొబైల్ నెట్‌వర్క్ లేకపోయినా కాల్స్, మెసేజ్‌లు చేసుకోవచ్చు. అమెరికాకు చెందిన కమ్యూనికేషన్స్ కంపెనీ వయాశాట్‌తో కలిసి బీఎస్ఎన్ఎల్ ఈ కొత్త సేవను అభివృద్ధి చేసింది. ఇటీవల ముగిసిన ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో కొత్త లోగోను ఆవిష్కరించడంతో పాటు ఏడు కొత్త సేవలు అందుబాటులోకి తెస్తున్నట్టు బీఎస్ఎన్ఎల్ ప్రకటించింది. ఇందులో 'డైరెక్ట్ టూ డివైజ్' సాంకేతికత ప్రధానమైనది. నాన్-టెర్రెస్ట్రియల్ నెట్‌వర్క్(ఎన్‌టీఎన్) కనెక్టివిటీతో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లను ఉపయోగించి ఈ టెక్నాలజీని పరీక్షిస్తున్నది. ఉపగ్రహం, ప్రాంతీయ మొబైల్ నెట్‌వర్క్‌లను అనుసంధానం చేయడం ద్వారా ఈ సాంకేతికత పని చేస్తుంది. దీని కోసం అంతరిక్షంలోని ఉపగ్రహాలు మొబైల్ టవర్లలా ఉపయోగపడతాయి.

నెట్‌వర్క్ లేకపోయినా..

డీ2డీ ద్వారా సెల్యులార్, వైఫై నెట్‌వర్క్ లేని కొండకోనలు, సముద్రాలు, మారుమూల ప్రదేశాల నుంచి, విపత్తులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఫోన్‌లు చేసేందుకు, మెసేజ్‌లు పంపేందుకు, యూపీఐ పేమెంట్లు చేసేందుకు వీలవుతుంది.

చీర బిగువుగా కడితే క్యాన్సర్ ముప్పు!

హెచ్చరించిన వైద్యులు

న్యూఢిల్లీ, నవంబర్ 6: భారతీయ వస్త్రధారణలో చీరది ప్రత్యేక స్థానం. దేశంలో ఎక్కువ మంది మహిళలు చీరలే కట్టుకుంటారు. అయితే, చీర కట్టుకోవడాన్ని ఇష్టపడే మహిళలకు వైద్యులు కీలక హెచ్చరిక చేశారు. చీర బిగువుగా కట్టుకోవడం వల్ల చర్మ క్యాన్స